# శ్రీ వినాయక వ్రత కల్పము



తేది: సెప్టెంబర్7, 2005
భాద్రపద శుద్ధ చవితి

హాస్యం.కామ్ సమర్పణ

## శ్రీ గణేష పూజా విధానము

### వినాయక వ్రతకల్పః

**ఆచమ్య:-** ఓం కేశవాయ స్వాహా - ఓం నారాయణా స్వాహా - ఓం మాధవాయ స్వాహా - (అను మంత్రములతో మూడు మారులు నీటిని తాగిన తరువాత) ఓం గోవిందాయ నమః - విష్ణవే నమః - మధుసూదనాయ నమః - త్రివిక్రమాయ నమః - వామనాయ నమః - శ్రీధరాయ నమః - హృషీకేశాయ నమః - పద్మనాభాయ నమః - దామోదరాయ నమః - సంకర్షణాయ నమః - వాసుదేవాయ నమః - ప్రద్యుమ్నాయ నమః - అనిరుద్ధాయ నమః - పురుషోత్తమాయ నమః - అధోక్షజాయ నమః - నారసింహాయ నమః - అచ్యుతాయ నమః - జనార్ధనాయ నమః - ఉపేంద్రాయ నమః - హరయే నమః - శ్రీ కృష్ణాయ నమః

**శ్లో!! శుక్లాంబరధరం విష్ణుం - శశివర్ణం చతుర్భుజం ।**
**ప్రసన్నవదనం ధ్యాయే - త్సర్వవిఘ్నోపశాంతయే ॥**

### వినాయక ప్రార్థనా

సుముఖ శ్చైకదంతశ్చ - కపిలో గజకర్ణకః,
లమ్బోదరశ్చ వికటో - విఘ్నరాజో గణాధిపః.
ధూమకేతు ర్గణాధ్యక్షః - ఫాలచన్ద్రో గజాననః,
వక్రతుండ శ్శూర్పకర్ణో - హేరమ్బః స్కన్దపూర్వజః.
షోడశైతాని నామాని - యః పఠే చ్ఛృణుయా దపి,
విద్యారమ్భే వివాహే చ - ప్రవేశే నిర్గమే తథా,
సఙ్గ్రామే సర్వ కార్యేషు విఘ్నస్తస్య న జాయతే.
అభీప్సితార్థసిద్ధ్యర్థం - పూజితో య స్సురైరపి,
సర్వవిఘ్నచ్ఛిదే తస్మై - గణాధి పతయే నమః

### ప్రాణాయామః

ఓం దేవీ గాయత్రీ ఛందః ప్రాణాయామే వినియోగః

ఓం భూః ఓం భువః ఓం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓం సత్యం – ఓం తత్సవితుర్వరేణ్యం – భర్గోదేవస్య ధీమహి । ధియో యోనః ప్రచోదయాత్. ఓమాపో జ్యోతీ రసోమృతం బ్రహ్మ భూర్భువః సువరోమ్.

మమోపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీపరమేశ్వర ప్రీత్యర్థం శుభే శోభనముహూర్తే శ్రీ మహావిష్ణో రాజ్ఞయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్ధే శ్వేతవరాహకల్పే వైవస్వతమన్వంతరే కలియుగే ప్రథమపాదే జంబూద్వీపే భరతవర్షే, భరతఖండే మేరోర్దక్షిణ దిగ్భాగే సమస్తదేవతా బ్రాహ్మణ హరిహరసన్నిధౌ అస్మిన్ వర్తమానవ్యావహారిక చాంద్రమానేన .... నామసంవత్సరే .... ఆయనే .... వర్షఋతౌ భాద్రపదమాసే శుక్లపక్షే చతుర్థ్యాం .... వాసరే శుభనక్షత్రే శుభయోగే శుభకరణే ఏవంగుణ విశేషణ విశిష్టాయాం శుభతిథౌ అస్మాకం సహకుటుంబానాం క్షేమ స్థైర్య ధైర్య విజయాయురారోగ్యైశ్వర్యాభి వృద్ధ్యర్థం ధర్మార్థకామమోక్షచతుర్విధ పురుషార్థ ఫలసిద్ధ్యర్థం పుత్రపౌత్రాభి వృద్ధ్యర్థం ఇష్టకామ్యార్థ సిద్ధర్థ్యం మనోవాంఛా ఫలసిద్ధ్యర్థం సమస్త దురితోపశాంత్యర్థం సమస్త మంగళావాప్త్యర్థం వరసిద్ధి వినాయక దేవతా ముద్దిశ్య వరసిద్ధివినాయక ప్రీత్యర్థం కల్పోక్త ప్రకారేణ యావచ్ఛక్తిధ్యానా వాహనాది షోడశోపచార పూజాం కరిష్యే.

**(అని చెప్పి పంచపాత్రయందలి నీటిని తాకవలయును.)**

**తదంగత్వేన కలశపూజాం కరిష్యే.**

**కలశపూజా**

కలశం గంధపుష్పాక్షతై రభ్యర్చ్య (కలశమునకు గంధపు బొట్లుపెట్టి అక్షతలద్ది లోపల నొక పుష్పము నుంచి తదుపరి ఆ పాత్రను కుడిచేతితో మూసి ఈ క్రింది మంత్రములను చదువవలెను.)

కలశస్య ముఖే విష్ణుః – కంఠే రుద్ర స్సమాశ్రితః ।
మూలే తత్ర స్థితో బ్రహ్మ – మధ్యే మాతృగణాః స్మృతాః ॥
కుక్షౌ తు సాగరాః సర్వే – సప్తద్వీపా వసుంధరా ।
ఋగ్వేదో థ యజుర్వేదః – సామవేదో హ్యథర్వణః ॥
అంగైశ్చ సహితాః సర్వే – కలశాంబు సమాశ్రితాః ।

ఆయాన్తు దేవపూజార్థం దురితక్షయ కారకాః ॥
గంగేచ యమునే చైవ – గోదావరి సరస్వతి ।
నర్మదే సింధు కావేరి – జలేస్మిన్ సన్నిధిం కురు ॥

కలశోదకేన పూజాద్రవ్యాణి దేవమండప మాత్మానం చ సంప్రోక్ష్య. (కలశమందలి జలమును చేతిలో పోసికొని పూజకొరకైన వస్తువులమీదను దేవుని మందసమునందును తన నెత్తిమీదను చల్లుకొనవలసినది.)

తదంగత్వేన వరసిద్ధివినాయక ప్రాణప్రతిష్ఠాపనం కరిష్యే.

## ప్రాణ ప్రతిష్ఠా

శ్లో॥ అసునీ తే పున రస్మాసు చక్షుః
పునః ప్రాణ మిహ నో ధేహి భోగమ్,
జ్యో కృశ్యేమ సూర్య ముచ్చరంత –
మనుమతే మృడయా న స్స్వస్తి.
అమృతం వై ప్రాణా అమృత మాపః ప్రాణానేవ యథాస్థాన ముపహ్వయతే.
స్వామిన్ సర్వజగన్నాథ – యావత్పూజావసానకమ్ ।
తావ త్త్వం ప్రీతిభావేన – బింబే స్మిన్ సన్నిధిం కురు ॥
ఆవాహితో భవ, స్థాపితో భవ, సుప్రసన్నో భవ, వరదో భవ,
ఆవకుంఠితో భవ, స్థిరాసనం కురు, ప్రసీద, ప్రసీద, ప్రసీద.

## పూజా విధానమ్

శ్లో॥ భవసంచితపాపౌఘ – విధ్వంసనవిచక్షణం ।
విఘ్నాంధకారభాస్వంతం – విఘ్నరాజ మహం భజే ॥
ఏకదంతం శూర్పకర్ణం – గజవక్త్రం చతుర్భుజం ।
పాశాంకుశధరం దేవం – ధ్యాయే త్సిద్ధివినాయకమ్ ॥

ఉత్తమం గణనాథస్య – వ్రతం సంపత్కరం శుభం ।
భక్తాభీష్టప్రదం తస్మా – ద్ధ్యాయే త్తం విఘ్ననాయకమ్ ॥
ధ్యాయే ద్గజాననం దేవం – తప్తకాంచనసన్నిభం ।
చతుర్భుజం మహాకాయం సర్వాభరణ భూషితమ్ ॥
శ్రీ వరసిద్ధి వినాయకం ధ్యాయామి.

శ్లో॥ అత్రా  గచ్ఛ జగద్వంద్య – సురరాజార్చితేశ్వర ।
అనాథనాథ సర్వజ్ఞ – గౌరీగర్భసముద్భవ ॥
శ్రీ వరసిద్ధి వినాయకం ఆవాహయామి

శ్లో॥ మౌక్తికైః పుష్పరాగైశ్చ – నానారత్నై ర్విరాజితం ।
రత్నసింహాసనం చారు – ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ ఆసనం సమర్పయామి.

శ్లో॥ గౌరీపుత్ర! నమస్తే  స్తు – శంకర ప్రియనందన ।
గృహాణార్ఘ్యం మయా దత్తం – గంధపుష్పాక్షతైర్యుతం ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ అర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ గజవక్త్ర నమస్తే స్తు – సర్వాభీష్టప్రదాయక ।
భక్త్యా పాద్యం మయా దత్తం – గృహాణ ద్విరదానన ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ పాద్యం సమర్పయామి.

శ్లో॥ అనాథనాథ సర్వజ్ఞ – గీర్వాణవరపూజిత ।
గృహాణా  చమనం దేవ! – తుభ్యం దత్తం మయా ప్రభో ॥

శ్రీ వరసిద్ధి వినాయకాయ ఆచమనీయం సమర్పయామి.

శ్లో॥ దధిక్షీరసమాయుక్తం - మధ్వాజ్యేన సమన్వితం ।
మధుపర్కం గృహాణేదం - గజవక్త్ర నమోస్తుతే ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ మధుపర్కం సమర్పయామి.

శ్లో॥ స్నానం పంచామృతై ర్దేవ - గృహాణ గణనాయక ।
అనాథనాథ! సర్వజ్ఞ - గీర్వాణ గణపూజిత ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ పంచామృతస్నానం సమర్పయామి.

శ్లో॥ యాః ఫలినీర్యా అఫలా - అపుష్పాయాశ్చ పుష్పిణీః ।
బృహస్పతి ప్రసూతా - స్తానో ముంచన్త్వగ్ంహసః ॥
శ్రీ వరసిద్ధి వినాయకం ఫలోదకేన స్నాపయామి.

శ్లో॥ గంగాదిసర్వతీర్థేభ్య - ఆహృతై రమలైర్జలైః ।
స్నానం కురుష్వ భగవ న్నుమాపుత్ర నమో స్తుతే ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ శుద్ధోదకస్నానం కారయామి.

శ్లో॥ రక్తవస్త్రద్వయం చారు - దేవయోగ్యం చ మంగళం ।
శుభప్రదం గృహాణ త్వం - లంబోదర హరాత్మజ ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ వస్త్రయుగ్మం సమర్పయామి.

శ్లో॥ రాజతం బ్రహ్మసూత్రం చ - కాంచనం చోత్తరీయకం ।
గృహాణ దేవ సర్వజ్ఞ - భక్తానా మిష్టదాయక ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ యజ్ఞోపవీతం సమర్పయామి.

శ్లో॥ చందనాగురుకర్పూర - కస్తూరీకుంకుమాన్వితం ।

విలేపనం సురశ్రేష్ఠ - ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్ ॥

శ్రీ వరసిద్ధి వినాయకం గంధాన్ ధారయామి.

శ్లో॥ అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ - శాలీయాం స్తండులాన్ శుభాన్ ।
గృహాణ పరమానంద - శంభుపుత్ర నమో స్తుతే ॥

శ్రీ వరసిద్ధి వినాయకాయ అలంకారార్థం అక్షతాన్ సమర్పయామి.

శ్లో॥ సుగన్ధాని చ పుష్పాణి - జాజీకుందముఖాని చ ।
ఏకవింశతిప్రతాణి - సంగృహాణ నమో స్తుతే ॥

శ్రీ వరసిద్ధి వినాయకం పుష్పైః పూజయామి.

**అథాంగ పూజా**

| | | |
|---|---|---|
| గణేశాయ నమః | పాదౌ | పూజయామి ॥ |
| ఏకదంతాయ నమః | గుల్ఫౌ | పూజయామి ॥ |
| శూర్పకర్ణాయ నమః | జానునీ | పూజయామి ॥ |
| విఘ్నరాజాయ నమః | జంఘే | పూజయామి ॥ |
| ఆఖువాహనాయ నమః | ఊరూ | పూజయామి ॥ |
| హేరంబాయ నమః | కటిం | పూజయామి ॥ |
| లంబోదరాయ నమః | ఉదరం | పూజయామి ॥ |
| గణనాథాయ నమః | హృదయం | పూజయామి ॥ |
| స్థూలకంఠాయ నమః | కంఠం | పూజయామి ॥ |
| స్కందాగ్రజాయ నమః | స్కంధౌ | పూజయామి ॥ |
| పాశహస్తాయ నమః | హస్తౌ | పూజయామి ॥ |
| గజవక్త్రాయ నమః | వక్త్రం | పూజయామి ॥ |

విఘ్నహంత్రే నమః నేత్రే పూజయామి ॥
శూర్పకర్ణాయ నమః కర్ణౌ పూజయామి ॥
ఫాలచంద్రాయ నమః లలాటం పూజయామి ॥
సర్వేశ్వరాయ నమః శిరః పూజయామి ॥

విఘ్నరాజాయ నమః సర్వాణి అంగాని పూజయామి.

## ఏక వింశతి పత్రపూజా

సుముఖాయ నమః మాచీ పత్రేణ పూజయామి ॥
గణాధిపాయ నమః బృహతీ పత్రేణ పూజయామి ॥
ఉమాధిపాయ నమః బిల్వ పత్రేణ పూజయామి ॥
గజాననాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి ॥
హరసూనవే నమః దుత్తూర పత్రేణ పూజయామి ॥
లంబోదరాయ నమః బదరీ పత్రేణ పూజయామి ॥
గుహాగ్రజాయ నమః అపామార్గ పత్రేణ పూజయామి ॥
గజకర్ణకాయ నమః తులసీ పత్రేణ పూజయామి ॥
ఏకదంతాయ నమః చూత పత్రేణ పూజయామి ॥
వికటాయ నమః కరవీర పత్రేణ పూజయామి ॥
భిన్న దంతాయ నమః విష్ణుక్రాంత పత్రేణ పూజయామి ॥
వటవే నమః దాడిమీ పత్రేణ పూజయామి ॥
సర్వేశ్వరాయ నమః దేవదారు పత్రేణ పూజయామి ॥
ఫాలచంద్రాయ నమః మరువక పత్రేణ పూజయామి ॥
హేరంబాయ నమః సింధువార పత్రేణ పూజయామి ॥
శూర్పకర్ణాయ నమః జాజీ పత్రేణ పూజయామి ॥
సురాగ్రజాయ నమః గణకీ పత్రేణ పూజయామి ॥
ఇభవక్త్రాయ నమః శమీ పత్రేణ పూజయామి ॥

వినాయకాయ నమః అశ్వత్థ పత్రేణ పూజయామి ॥
సురసేవితాయ నమః అర్జున పత్రేణ పూజయామి ॥
కపిలాయ నమః అర్క పత్రేణ పూజయామి ॥

శ్రీ గణేశ్వరాయ నమః ఏకవింశతి పత్రైః పూజయామి

## అష్టోత్తర శతనామావళిః

ఓం గం వినాయకాయ నమః
ఓం విఘ్నరాజాయ నమః
ఓం గౌరీపుత్రాయ నమః
ఓం గణేశ్వరాయ నమః
ఓం స్కందాగ్రజాయ నమః
ఓం అవ్యయాయ నమః
ఓం పూతాయ నమః
ఓం దక్షాయ నమః
ఓం అధ్యక్ష్యాయ నమః
ఓం ద్విజప్రియాయ నమః 10
ఓం అగ్నిగర్భచ్ఛిదే నమః
ఓం ఇంద్రశ్రీప్రదాయ నమః
ఓం వాణీప్రదాయ నమః
ఓం అవ్యయాయ నమః
ఓం సర్వసిద్ధిప్రదాయ నమః
ఓం శర్వతనయాయ నమః
ఓం శర్వరీప్రియాయ నమః
ఓం సర్వాత్మకాయ నమః
ఓం సృష్టికర్త్రే నమః
ఓం దేవాయ నమః 20

ఓం అనేకార్చితాయ నమః
ఓం శివాయ నమః
ఓం శుద్ధాయ నమః
ఓం బుద్ధిప్రియాయ నమః
ఓం శాంతాయ నమః
ఓం బ్రహ్మచారిణే నమః
ఓం గజాననాయ నమః
ఓం ద్వైమాత్రేయాయ నమః
ఓం గజస్తుత్యాయ నమః
ఓం భక్తవిఘ్న వినాశకాయ నమః 30
ఓం ఏకదంతాయ నమః
ఓం చతుర్బాహవే నమః
ఓం చతురాయ నమః
ఓం శక్తిసంయుతాయ నమః
ఓం లంబోదరాయ నమః
ఓం శూర్పకర్ణాయ నమః
ఓం హరయే నమః
ఓం బ్రహ్మవిదుత్తమాయ నమః
ఓం కాలాయ నమః
ఓం గ్రహపతయే నమః 40
ఓం కామినే నమః
ఓం సోమసూర్యాగ్ని లోచనాయ నమః
ఓం పాశాంకుశధరాయ నమః
ఓం చండాయ నమః
ఓం గుణాతీతాయ నమః

ఓం నిరంజనాయ నమః
ఓం అకల్మషాయ నమః
ఓం స్వయంసిద్ధాయ నమః
ఓం సిద్ధార్చిత పదాంబుజాయ నమః
ఓం బీజపూర ఫలాసక్తాయ నమః 50
ఓం వరదాయ నమః
ఓం శాశ్వతాయ నమః
ఓం కృతినే నమః
ఓం విద్వత్ ప్రియాయ నమః
ఓం వీతభయాయ నమః
ఓం గదినే నమః
ఓం చక్రిణే నమః
ఓం ఇక్షుచాపభృతే నమః
ఓం శ్రీదాయ నమః
ఓం అజాయ నమః 60
ఓం ఉత్పలకరాయ నమః
ఓం శ్రీపతయే నమః
ఓం స్తుతిహర్షితాయ నమః
ఓం కులాద్రిభేత్త్రే నమః
ఓం జటిలాయ నమః
ఓం కలికల్మషనాశనాయ నమః
ఓం చంద్రచూడామణయే నమః
ఓం కాంతాయ నమః
ఓం పాపహారిణే నమః
ఓం సమాహితాయ నమః 70

ఓం ఆశ్రితాయ నమః
ఓం శ్రీకరాయ నమః
ఓం సౌమ్యాయ నమః
ఓం భక్త వాంఛిత దాయకాయ నమః
ఓం శాంతాయ నమః
ఓం కైవల్యసుఖదాయ నమః
ఓం సచ్చిదానందవిగ్రహాయ నమః
ఓం జ్ఞానినే నమః
ఓం దయాయుతాయ నమః
ఓం దాంతాయ నమః 80
ఓం బ్రహ్మద్వేషవివర్జితాయ నమః
ఓం ప్రమత్తదైత్యభయదాయ నమః
ఓం శ్రీకంఠాయ నమః
ఓం విబుధేశ్వరాయ నమః
ఓం రమార్చితాయ నమః
ఓం విధయే నమః
ఓం నాగరాజయజ్ఞోపవీతవతే నమః
ఓం స్థూలకంఠాయ నమః
ఓం త్రయీకర్త్రే నమః
ఓం సామఘోష ప్రియాయ నమః 90
ఓం పరస్మై నమః
ఓం స్థూలతుండాయ నమః
ఓం అగ్రణ్యే నమః
ఓం ధీరాయ నమః
ఓం వాగీశాయ నమః

ఓం సిద్ధిదాయకాయ నమః
ఓం దూర్వాబిల్వప్రియాయ నమః
ఓం అవ్యక్తమూర్తయే నమః
ఓం అద్భుతమూర్తిమతే నమః
ఓం శైలేంద్రతనయోత్సంగ
ఖేలనోత్సుకమానసాయ నమః
ఓం స్వలావణ్యసుధాసారజిత
మన్మథవిగ్రహాయ నమః
ఓం సమస్తజగదాధారాయ నమః
ఓం మాయినే నమః
ఓం మూషకవాహనాయ నమః
ఓం హృష్టాయ నమః
ఓం తుష్టాయ నమః
ఓం ప్రసన్నాత్మనే నమః
ఓం సర్వసిద్ధి ప్రదాయకాయ నమః 108

**శ్రీవిఘ్నేశ్వరాయ నమః శ్రీవరసిద్ధి వినాయకాయ నమః**
అష్టోత్తర శతనామపూజాం సమర్పయామి

శ్లో॥ దశాంగం గుగ్గులూపేతం – సుగంధి సుమనోహరం ।
ఉమాసుత నమస్తుభ్యం – గృహాణ వరదో భవ ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః ధూప మాఘ్రాపయామి.

శ్లో॥ సాజ్యం త్రివర్తిసంయుక్తం – వహ్నినా ద్యోతితం మయా ।
గృహాణ మంగళం దీప – మీశపుత్ర నమోస్తుతే ॥

శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః దీపం దర్శయామి.

శ్లో॥ సుగంధాన్ సుకృతాంశ్చైవ – మోదకాన్ ఘృతపాచితాన్ ।
నైవేద్యం గృహ్యతాం దేవ – చణముద్గైః ప్రకల్పితాన్ ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః గంధం సమర్పయామి.

శ్లో॥ భక్ష్యం భోజ్యం చ లేహ్యం చ – చోష్యం పానీయ మేవ చ ।
ఇదం గృహాణ నైవేద్యం – మయా దత్తం వినాయక ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః మహానైవేద్యం సమర్పయామి.

శ్లో॥ పూగీఫలసమాయుక్తం – నాగవల్లీ దళైర్యుతం ।
కర్పూర చూర్ణసంయుక్తం – తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయస్వామినే నమః తాంబూలం సమర్పయామి.

శ్లో॥ సదానందద విఘ్నేశ – పుష్కలాని ధనాని చ ।
భూమ్యాం స్థితాని భగవన్ – స్వీకురుష్వ వినాయక ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః సువర్ణపుష్పం సమర్పయామి.

శ్లో॥ ఘృతవర్తిసహస్రైశ్చ – కర్పూరశకలైస్తథా ।
నీరాజనం మయా దత్తం – గృహాణ వరదో భవ ॥
శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః నీరాజనం దర్శయామి.

**నీరాజనానంతరం ఆచమనీయం సమర్పయామి.**

**దూర్వాయుగ్మ పూజా**

గణాధిపాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
ఉమాపుత్రాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.

అఖువాహనాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
వినాయకాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
ఈశ పుత్రాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
సర్వసిద్ధిప్రదాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
ఏకదంతాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
ఇభవక్త్రాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
మూషకవాహనాయ నమః దూర్వాయుగ్మేన పూజయామి.
కుమారగురవే నమః దూర్వాయుగ్మేన పూజయామి.

శ్లో॥ గణాధిప నమస్తేస్తు – ఉమాపుత్రాఘనాశన ।
వినాయకేశతనయ – సర్వసిద్ధిప్రదాయక
ఏకదంతైకవదన – తథా మూషకవాహన ।
కుమారగురవే తుభ్య – మర్పయామి సుమాంజలిమ్ ॥

శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః మంత్రపుష్పం సమర్పయామి.

శ్లో॥ ప్రదక్షిణం కరిష్యామి – సతతం మోదకప్రియ ।
నమస్తే విఘ్నరాజాయ నమస్తే విఘ్ననాశన ॥

శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః ఆత్మప్రదక్షిణ నమస్కారం సమర్పయామి.

శ్లో॥ అర్ఘ్యం గృహాణ హేరంబ – సర్వభద్రప్రదాయక ।
గంధపుష్పాక్షతై ర్యుక్తం – పాత్రస్థం పాపనాశన ॥

శ్రీ వరసిద్ధి వినాయకాయ నమః అర్ఘ్యం సమర్పయామి.

శ్లో॥ నమస్తుభ్యం గణేశాయ – నమస్తే విఘ్ననాశన ।
ఈప్సితం మే వరం దేహి – పరత్ర చ పరాం గతిమ్ ॥
శ్లో॥ వినాయక నమస్తుభ్యం – సతతం మోదకప్రియ ।
నిర్విఘ్నంకురు మే దేవ – సర్వకార్యేషు సర్వదా ॥

**(అని వినాయకుని ప్రార్థన చేయవలెను)**

## విఘ్నేశ్వరుని కథ

### వాడుక భాషలో వినాయక కథ

(వినాయకుడి కథ అచ్చుతెలుగులోనే అన్ని చోట్ల లభ్యం అవుతోంది. అయితే తేలిగ్గా అర్థం అవడానికి, చదువుకోడానికి వీలుగా ఉండటానికి అనువుగా ఈ కథని రచయిత 'శ్రీ మల్లాది వెంకట కృష్ణమూర్తి' చేత వాడుక భాషలో రాయించి అందిస్తున్నాం.)

* * *

ఓ రోజు నైమిశారణ్యంలో శౌనకుడు ఇతర మహర్షులని సూత మహర్షిని కలిశాడు. సత్‌సంగ కాలక్షేపం కోసం ఆయన శౌనకుడు, ఇతరులకి వినాయకుడి పుట్టుక, చంద్రుణ్ణి దర్శిస్తే వచ్చే దోషం, దాని నివారణ గురించి సూత మహాముని శౌనకుడు, ఇతర మునులకి చెప్పాడు.

పూర్వం ఏనుగు రూపంలో గల గజాసురుడు అనే రాక్షసుడు శివుని కోసం గొప్ప తపస్సు చేసాడు. ఆ తపస్సుకి మెచ్చిన ఈశ్వరుడు ప్రత్యక్షమై గజాసురుని అడిగాడు.

"రాక్షసా! ఏమి నీ కోరిక?"

గజాసురుడు శివుణ్ణి భక్తితో అనేక రకాలుగా స్తుతించాక తన కోరికనిలా చెప్పాడు.

"స్వామీ! నువ్వు ఎల్లప్పుడూ నా కడుపులోనే నివాసం ఉండాలని నా కోరిక."

భక్తులకి తేలికగా ప్రత్యక్షమై, వారి కోరికలని ఇట్టే తీర్చి తనమీదకి తెచ్చుకొనే స్వభావంగల శివుడు గజాసురుడి పొట్టలోకి ప్రవేశించి హాయిగా నివశించసాగాడు.

అక్కడ కైలాసంలో పార్వతీదేవి తన భర్త అయిన శివుడి జాడ తెలీక ఆయనకోసం అన్వేషిస్తూ, ఆయన గజాసురుడి పొట్టలో ఉన్నాడన్న విషయాన్ని తెలుసుకుంది. దాంతో పార్వతి విష్ణుమూర్తి దగ్గరకి ఏడుస్తూ వెళ్ళి జరిగింది చెప్పి, ఆయన సహాయం కోరింది.

"ఓ మహానుభావా! పూర్వం భస్మాసురుడినించి నువ్వు నా భర్తని రక్షించావు. అలాగే ఇప్పుడు నువ్వు గజాసురుడి బారినించి కూడా ఆయన్ని విడిపించి రక్షించాలి."

శ్రీహరి ఆమెని ఊరడించి చెప్పాడు.

"శివుని వాహనమైన నందిని నా దగ్గరికి పంపు నీ కోరిక తీరుస్తాను. గజాసుర సంహారానికి గంగిరెద్దుల మేళమే తగినది."

బ్రహ్మ, ఇతర దేవతలందరినీ వెంటనే రావలసిందిగా విష్ణుమూర్తి కబురు పంపాడు. నందిని గంగిరెద్దుగా అలంకరించి దేవతలకి తలో వాయిద్యం ఇచ్చి, తనూ చిరుగంటలూ సన్నాయిని అందుకుని, వారందరితో గజాసురుడి దగ్గరికి వెళ్ళాడు.

ఆ ఊళ్ళో, మనోహరంగా సాగే ఆ గంగిరెద్దు మేళాన్ని గురించి విన్న గజాసురుడు దాన్ని స్వయంగా చూసి ఎంతో వినోదించాడు. మేళం పెద్దయిన శ్రీహరితో చెప్పాడు.

"నరుడా! నీకేం కావాలో కోరుకో."

"అయ్యా! ఇది శివుడి వాహనమైన నంది. శివుని కోసం వచ్చింది. కాబట్టి దానికి ఆయన్ని చూపించు. తర్వాత మా దారిన మేం వెళతాం."

అది వినగానే గజాసురుడు ఉలిక్కిపడ్డాడు. తన పొట్టని చీల్చుకుని కానీ శివుడు బయటికి రాలేడు. వస్తే తనకు మరణం తప్పదు. దివ్యదృష్టితో గజాసురుడు ఆ కోరిక కోరింది శ్రీహరి అని తెలుసుకుని, ఇక తనకి చావు తప్పదని గ్రహించి తన కడుపులోని శివుణ్ణి ఇలా కోరాడు.

"స్వామీ! నేను మరణించాక నా తలని మూడు లోకాలలో పూజించేలా చేయి. నా చర్మాన్ని నువ్వు ధరించు."

శివుడు అందుకు అంగీకరించగానే, శ్రీహరి నందికి సైగ చేసాడు. నంది తన కొమ్ములతో గజాసురుని కడుపు చీల్చి అతన్ని చంపేసింది. పొట్టనించి బయటపడ్డ శివుడితో శ్రీహరి చెప్పాడు.

"పరమశివా! దుర్మార్గులకి ఇలాంటి వరాలు ఇవ్వడం పాముకి పాలు పోయడంతో సమానం సుమా!"

బ్రహ్మని, ఇతర దేవతలని, వారి వారి లోకాలకి పంపించేసిన శ్రీహరి కూడా వైకుంఠానికి వెళ్ళిపోయాడు. శివుడు నందిని ఎక్కి కైలాసానికి బయలుదేరాడు.

## వినాయకుని జననం

అతి త్వరలో తన భర్త తిరిగి కైలాసానికి వస్తున్నాడని తెలుసుకున్న పార్వతి ఉత్సాహంగా తలంటు పోసుకోవడానికి తయారయింది. తన ఒంటిమీది సున్నిపిండిని నలిపి తీసి, ఆ నలుగు పిండితో ఓ చిన్న పిల్లవాడి బొమ్మని చేసి దానికి ప్రాణం పోసి చెప్పింది.

"కుమారా! నువ్వు కాపలా ఉండి, లోపలికి ఎవరినీ రానీయక."

ఆ బాలుడు అందుకు ఒప్పుకుని సింహద్వారం వద్దకి వెళ్ళాడు. పార్వతి స్నానం ముగించుకుని, అనేక నగలని ధరించి, భర్తకోసం ఆత్రంగా వేచి చూడసాగింది.

కైలాసం చేరుకున్న శివుడు లోపలకి వెళ్ళబోతూంటే, పార్వతి కాపుంచిన పిల్లవాడు ఆయన్ని అడ్డగించాడు. శివుడికి

కోపం వచ్చి త్రిశూలంతో ఆ పిల్లవాడి తలని తెక్కోసి లోపలికి వెళ్ళాడు.

పార్వతి శివుడికి ఎదురెళ్ళి, ఆహ్వానించి ఆయనకి కాళ్ళు కడుక్కోవడానికి, తాగడానికి నీళ్ళిచ్చి పతివ్రతాధర్మం ప్రకారం పూజించింది.

చాలాకాలం తర్వాత కలుసుకున్న వారిద్దరూ అనేక విషయాలు ముచ్చటించుకున్నారు. వారి సంభాషణలో ద్వారం దగ్గరి బాలుడి ప్రసక్తి వచ్చింది. పార్వతి జరిగింది చెప్పగానే శివుడు విచారిస్తూ చెప్పాడు.

"అయ్యో! నేను వాడి తలని నరికేసానే?"

ఇద్దరూ కొద్దిసేపు బాధపడ్డాక శివుడికి గజాసురుడికిచ్చిన వరం గుర్తుకొచ్చి, ఆ గజాసురుడి తలని తెచ్చి, మరణించిన ఆ బాలుడికి అతికించి, ప్రాణం పోసి చెప్పాడు.

"వత్సా! నీకు గజాననుడు అనే పేరు పెడుతున్నాను."

పార్వతి గజాననుడ్ని ప్రేమగా పెంచుకోసాగింది. గజాననుడు కుడా తన తల్లి తండ్రులతో ప్రేమగా మెలుగుతూ పెరగసాగాడు. అనిందుృడనే ఎలుకని తన వాహనంగా చేసుకుని దానిమీద తిరగసాగాడు.

మరికొంత కాలానికి పార్వతీ పరమేశ్వరులకి ఓ కొడుకు పుట్టాడు. అతడికి 'కుమారస్వామి' అనే పేరు పెట్టారు. మహాబలశాలి అయిన కుమారస్వామి నెమలిని తన వాహనంగా చేసుకున్నాడు.

**విఘ్నాలకి అధిపతి ఎవరు?**

ఓ రోజు అనేకమంది దేవతలు, మునులు, మానవులు పరమేశ్వరుడి దగ్గరికి వచ్చి, పూజించి చెప్పారు.

"స్వామీ! విఘ్నాలతో మా పనులు చాలా చెడిపోతున్నాయి. ఈ విఘ్నాలని శాసించేందుకుగాను మాకో అధిపతిని ఇవ్వండి. ఆయన్ని పూజించి విఘ్నాలు కలగకుండా చూసుకుంటాము."

తన పిల్లలలో ఒకరికి ఆ ఆధిపత్యాన్ని ఇవ్వాలని శివుడు సంకల్పించాడు. అది తెలిసిన గజాననుడు తండ్రిని అడిగాడు.

"నేను పెద్ద కొడుకుని కనుక ఆ ఆధిపత్యము నాకివ్వండి నాన్నగారు."

రెండో కొడుకు కుమారస్వామి తండ్రితో చెప్పాడు.

"నాన్నగారూ! అన్నయ్య మరుగుజ్జు. అందుచేత అసమర్ధుడు, అనర్హుడు అవుతాడు. ఆ ఆధిపత్యం నాకివ్వండి."

వారి వాదనలని విన్న శివుడు వారితో చిరునవ్వుతో చెప్పాడు.

"పిల్లలారా! మీలో ఎవరు ముందుగా ముల్లోకాల్లోని నదుల్లో స్నానం చేసి నా వద్దకి వస్తారో వారిని అందుకు అర్హులుగా నిర్ణయించి, వారికా ఆధిపత్యాన్నిస్తాను. వెంటనే బయలుదేరండి."

ఆ మాటలు వినీ వినగానే కుమారస్వామి నెమలినెక్కి ఆ పనిమీద రివ్వున బయలుదేరాడు. వినాయకుడు తన ఎలుక వంక విచారంగా చూసి తండ్రితో చెప్పాడు.

"నాన్నగారూ. ఎలుకనెక్కి వెళ్ళి నేను తమ్ముడికన్నా ముందుగా అన్ని నదుల్లో స్నానం చేసి రాలేను. నేను ఈ పోటీలో గెలిచే ఉపాయం మీరే చెప్పండి."

అప్పుడు శివుడు కొడుకుతో చెప్పాడు.

"కుమారా! ఎవరు ఒకసారి నారాయణ మంత్రాన్ని జపిస్తారో వారు మూడు వందల కల్పాల కాలం, పుణ్యనదుల్లో స్నానం చేసిన పుణ్యఫలాన్ని పొందుతారు."

"అలా అయితే ఆ మంత్రాన్ని ఉపదేశించండి నాన్నగారూ." ఉత్సాహంగా అడిగాడు గజాననుడు.

తండ్రి ఆ మంత్రోపదేశం చేయగానే, గజాననుడు కైలాసంలో అత్యంత భక్తిగా ఆ మంత్రాన్ని స్మరించసాగాడు.

-- -- --

మొదటగా కుమారస్వామి గంగానదికి వెళ్ళగా, అప్పటికే గంగలో స్నానం ముగించి, ఎదురొస్తున్న అన్నయ్య గజాననుడు ఎదురుపడ్డాడు. అతనికి ఆశ్చర్యం వేసింది. కుమారస్వామి మూడుకోట్ల ఏభై లక్షల నదుల్లో స్నానానికి వెళ్ళినా మంత్రమహిమ వల్ల గజాననుడు స్నానం చేసి ఎదురు రావడం కుమారస్వామికి కనిపించసాగింది. అఖరి స్నానం కూడా పూర్తిచేసి, ఎంతో ఆశ్చర్యంతో కుమారస్వామి కైలాసంలోని తండ్రి దగ్గరికి వెళ్ళి పశ్చాత్తాపంతో చెప్పాడు.

"నాన్నగారూ! అన్నగారి మహిమ తెలీక ఇందాక ఏదేదో మాట్లాడాను. నాకన్నా అన్నయ్యే అన్ని విధాలా సమర్థుడు కనుక గజాననుడినే విఘ్నాలకి అధిపతిని చేయండి."

ఆ ప్రకారం భాద్రపద శుద్ధ చవితినాడు పరమేశ్వరుడు గజాననుడికి విఘ్నాధిపత్యం వేడుకని జరిపించాడు. అప్పటినించి అంతా విఘ్నేశ్వరుడిగా పిలువబడే గజాననుడిని ఆరోజు పూజించి, వడపప్పు, పానకం, అరటిపండ్లు, తేనె, పాలు, కొబ్బరి, అతనికిష్టమైన కుడుములు, ఉండ్రాళ్ళు ఇతర పిండివంటలని నైవేద్యంగా పెట్టసాగారు.

-- -- --

ఆ భాద్రపద శుద్ధ చవితిన భూలోకంలో తనకి నైవేద్యం పెట్టిన వాటన్నిటినీ సుష్టుగా తిని విఘ్నేశ్వరుడు తన వాహనమైన ఎలుకకి కొన్ని పెట్టి కొన్ని చేతుల్లో తీసుకుని భుక్తాయాసంతో సూర్యాస్థమయ వేళకి మెల్లిగా కైలాసం చేరుకున్నాడు.

తల్లిదండ్రుల దగ్గరకెళ్ళి వంగి నమస్కారం చేయడానికి ప్రయత్నించాడు. అయితే తిన్నవాటితో కడుపుబ్బిన వినాయకుడు నేలమీద బోర్లా పడుకొన్నాడు. పొట్టమీద నిలిచిన చేతులు భూమికి అందలేదు. బలవంతంగా చేతులని

భూమికి ఆనిస్తే, కాళ్ళు పైకి లేవసాగాయి.

ఇలా సాష్టాంగ నమస్కారం చేయడానికి అవస్థ పడే విఘ్నేశ్వరుడిని చూసిన, శివుడి తలలోని చంద్రుడికి వినోదం కలిగి ఫక్కున నవ్వాడు. రాజదృష్టి సోకితే, రాళ్ళు కూడా పిండవుతాయంటారు. ఆ సామెత నిజమన్నట్లుగా వినాయకుడి పొట్ట పగిలి అందులోంచి ఉండ్రాళ్ళు, కుడుములు బయటికి వచ్చి నేలమీద దొర్లాయి. విఘ్నేశ్వరుడు మరణించాడు.

తక్షణం గర్భశోకంలో మునిగిన పార్వతి చంద్రుడి వంక కోపంగా చూసి ఈ విధంగా శపించింది.

"దుర్మార్గుడా! నీ చూపు తగిలి నా కుమారుడు మరణించాడు కాబట్టి నిన్ను చూసిన వారంతా నీలాపనిందలతో బాధపడుదురుగాక!"

**ఋషుల భార్యలకి ఆ శాపం తగులుట.**

సరిగ్గా ఆ రోజు ఆ సమయంలో భూలోకంలో సప్తర్షులు ఓ యజ్ఞం చేస్తున్నారు. వారి భార్యలు అగ్ని ప్రదక్షిణం చేస్తూండగా, అగ్ని దేవుడు ఆ ఏడుగురి భార్యలని చూసి ప్రేమలోపడ్డాడు. కాని వారిని ఏం చేయలేని వాడై, క్షీణించసాగాడు. ఈ సంగతి గ్రహించిన అగ్నిదేవుడి భార్య అయిన స్వాహా దేవి భర్త కోరికని తీర్చాలనుకుంది. అరుంధతి తప్ప, మిగిలిన ఆరుగురి రూపాలని తన మహత్తుతో ధరించి అగ్నిదేవుడి కోరికని తీర్చింది. ఆ ఆరుగురు మునులు అది చూసి, తమ భార్యల శీలాన్ని శంకించి వాళ్ళని వదిలేశారు. పార్వతి ఇచ్చిన శాపం వల్ల ఆ విధంగా చంద్రుణ్ణి చూసిన ఆ ఆరుగురు భార్యలమీద, తాము చేయని నేరం వచ్చి పడింది.

ఈ వివాదం శ్రీహరి దృష్టికి వచ్చింది. ఆయన తన దివ్యదృష్టితో జరిగింది గ్రహించి, ఆ ఋషుల దగ్గరికి వెళ్ళి జరిగింది చెప్పాడు.

"పార్వతీదేవి శాపం వల్ల ఇలా జరిగిందని మీరు నా ద్వారా తెలుసుకోగలిగారు. మరి నా సహాయం పొందలేని సామాన్యులకి కూడా మనం మేలు చేయాలికదా. పదండి."

శ్రీహరి అందరినీ వెంట తీసుకుని కైలాసానికి వెళ్ళాడు. కడుపు పగిలి మరణించి ఉన్న విఘ్నేశ్వరుని బ్రతికించి పార్వతికి సంతోషాన్ని కలిగించాడు. శ్రీహరి వెంట వచ్చిన వారంతా పార్వతిని ఇలా ప్రార్థించారు.

"తల్లీ! పార్వతీ. నువ్వు చంద్రుడికిచ్చిన శాపం వల్ల లోకులకి అనేక కష్టాలు వచ్చి పడుతున్నాయి. దయతో ఈ శాపాన్ని ఉపసంహరించి అందరినీ కాపాడు."

బ్రతికి వచ్చిన విఘ్నేశ్వరుడిని ముద్దు పెట్టుకుని పార్వతి తృప్తిగా చెప్పింది.

"సరే. ఏ రోజున చంద్రుడు మా అబ్బాయి విఘ్నేశ్వరుడిని చూసి నవ్వాడో ఆ రోజున మాత్రం చంద్రుడిని చూడకూడదు. చూస్తే, ఇలాంటి నీలాపనిందలు తప్పవు. మిగిలిన రోజుల్లో చూసినా ఏం కాదు."

బ్రహ్మ, ఇతర దేవతలు అది విని సంతోషించి, తమ తమ స్థానాలకి వెళ్ళారు. అప్పటినించి భాద్రపద మాస శుద్ధ చవితినాడు చంద్రుణ్ణి చూడకుండా ప్రజలు జాగ్రత్తపడుతూ అంతా సుఖంగా జీవించ సాగారు. ఇలా కొంత కాలం గడిచింది.

## శమంతకోపాఖ్యానం

ద్వాపర యుగం.

ఓ రోజు శ్రీకృష్ణుడు ద్వారకకి తనని చూడవచ్చిన నారదుణ్ణి భక్తిగా పూజించాడు. ఇద్దరూ అనేక విషయాలు ముచ్చటించుకున్నారు. సాయం సంధ్యా సమయంలో నారదుడు లేచి శెలవు తీసుకుంటూ శ్రీ కృష్ణుడితో చెప్పాడు.

"స్వామీ! ఇవాళ భాద్రపద శుద్ధ చవితి. వినాయకుడి కారణంగా పార్వతి శాపం వల్ల ఇవాళ చంద్రుణ్ణి చూడరాదు. చూస్తే నీలాపనిందలు తప్పవు. కాబట్టి వెళ్ళొస్తాను. శెలవిప్పించండి."

శ్రీకృష్ణుడికి ఆ శాప విషయాలన్నీ వివరించి నారదుడు స్వర్గానికి వెళ్ళిపోయాడు. దాంతో శ్రీ కృష్ణుడు ఆ రాత్రి చంద్రుణ్ణి ఎవరూ చూడరాదని పట్టణంలో చాటింపు వేయించాడు.

పాలంటే ఇష్టం కల శ్రీకృష్ణుడు ఆ రాత్రి బయటికివచ్చి, తలెత్తి ఆకాశం వంక చూడకుండా గోశాలకిపోయి పాలు పితుకుతుంటే, పాలగిన్నెలో చంద్రుడి ప్రతిబింబం కనిపించింది.

"ఆహా! చూడకూడని దినాన చంద్రుణ్ణి చూసానుకదా. ఆ శాప ఫలితంగా నాకేం నీలాపనిందలు రానున్నాయో" అనుకున్నాడాయన.

ఇలా కొంత కాలం గడిచింది. శ్రీకృష్ణుడి రాజ్యంలో సత్రాజిత్తు అనే అతనుండేవాడు. అతను సూర్యుణ్ణి పూజించి, శమంతకమణిని సంపాదించాడు. అతనో రోజు శ్రీకృష్ణుడిని చూడటానికి ద్వారకకి వచ్చాడు. శ్రీకృష్ణుడు అతనికి తగిన మర్యాదలు చేసాక, ఆ శమంతకమణి ప్రసక్తి రాగానే కృష్ణుడు దాన్ని తనకిమ్మని సూచించాడు.

"అమ్మో! ఇది రోజుకి ఎనిమిది బారువుల బంగారాన్నిస్తూంటుంది. ఇంత విలువైన మణిని ఎలా ఇస్తాను?" తిరస్కరించాడు సత్రాజిత్తు.

"సరే నీ ఇష్టం." అన్నాడు కృష్ణుడు.

-- -- --

మరికొంత కాలం గడిచాక సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుడా శమంతక మణిని మెళ్ళోధరించి, వేటాడటానికి వెళ్లాడు. ఓ సింహం ఆ మణిని చూసి అది మాంసం ముక్క అని పొరబడి ప్రసేనుడి మీదకి ఉరికి చంపేసింది.

ఆ మణిని నోటకరుచుకుని వెళ్ళే ఆ సింహాన్ని ఓ మగ ఎలుగు బంటి చూసి చంపాడు. ఆ మణితో తన నివాస స్థలానికి వెళ్ళి తన కుమార్తె జాంబవతికి ఆ మణిని ఆడుకోవడానికిచ్చాడు.

వేటకి వెళ్ళి తిరిగి రాని తమ్ముడికోసం సత్రాజిత్తు అడవికి మనుషులని పంపితే మణిలేని ఆతని శరీరం వారికి కనిపించింది. వారంతా వెంటనే వచ్చి ఆ సంగతి చెప్పారు. సత్రాజిత్తు శ్రీకృష్ణుడే తన తమ్ముణ్ణి చంపి ఆ మణిని దొంగిలించాడని భావించి నగరమంతా చాటింపు వేయించాడు.

ఈ సంగతి శ్రీకృష్ణుడికి తెలిసింది. భాద్రపదశుద్ధ చవితినాడు తను పాలలో చంద్రుని ప్రతి బింబాన్ని చూడటం వల్ల వచ్చిన నీలాపనిందగా దాన్ని గుర్తించాడు. బంధు మిత్రులతో వెంటనే శ్రీకృష్ణుడు అడవికి వెళ్ళి ప్రసేనుడి శవాన్ని, పక్కనే వున్న సింహపు కాలి గుర్తులని చూశాడు. వాటిననుసరించి వెళ్తే, అక్కడ చచ్చి పడివున్న సింహాన్ని పక్కన గల ఎలుగుబంటి పాదాల గుర్తులని గమనించాడు. ఆ కాలిగుర్తులని అనుసరించి వెళ్తే, అవి పర్వతంలోని గుహద్వారం దాకా వెళ్ళాయి. తన వెంట వచ్చిన వారిని అక్కడే వుండమని శ్రీకృష్ణుడు వంటరిగా ఆ గుహలోకి వెళ్ళాడు.

గుహలోని ఊయలకి ఆట వస్తువుగా కట్టి వున్న శమంతకమణిని చూసి, దాన్ని తీసుకుంటూండగా శ్రీకృష్ణుడిని చూసిన జాంబవతి భయపడింది.

"నాన్నా ఎవరో వింతమనిషి నా మణిని తీసుకుంటున్నాడు చూడు." అని గట్టిగా అరిచింది.

జాంబవంతుడు కోపంతో వచ్చి శ్రీకృష్ణుడిని చూసి, అతని పైబడి కోరలతో కొరుకుతూ, గోళ్ళతో గుచ్చుతూ చంపడానికి ప్రయత్నించాడు. శ్రీకృష్ణుడు ఆ ఎలుగుబంటిని కిందకి తోసి రాళ్ళతోనూ, వృక్షలతోనూ, పిడి గుద్దులతోనూ ఎదుర్కొన్నాడు. అలా ఇరవై ఎనిమిది రోజులపాటు వారిమధ్య యుద్ధం సాగింది. క్రమేపీ జాంబవంతుడి బలం క్షీణించింది. దెబ్బలుతినడం వల్ల అతని దేహమంతా నొప్పులే. తన బలాన్ని క్షీణింపజేయగలిగింది రావణుని చంపిన శ్రీరామ చంద్రుడే అని గ్రహించాడు జాంబవంతుడు. వెంటనే శ్రీకృష్ణునికి నమస్కారం చేస్తూ, భక్తితో కూడిన వినయంతో చెప్పాడు.

"దేవాదిదేవా! నువ్వు త్రేతాయుగంలో రావణుడు, ఇతర దుష్ట రాక్షసులను చంపడానికి అవతరించిన శ్రీరామచంద్రుడవని అర్థమైంది. ఓ సారి నువ్వు నామీద ప్రేమతో ఏదైనా వరం కోరుకోమంటే, బుద్ధి మాలి మీతో ద్వంద్వయుద్ధం చేయాలని వుందని చెప్పాను. సమయం వచ్చినప్పుడు అది జరుగుతుందని నువ్వు చెప్పావు. అప్పటినించి, అనేక యుగాలుగా నీ నామాన్నే స్మరిస్తూన్నాను. నా ఇంటికే వచ్చి నువ్వు నా కోరికని తీర్చావు. ధన్యుడిని. నా శరీరం అంతా నలిగి బాధగావుంది. నువ్వే నన్ను దయతో కాపాడు."

శ్రీకృష్ణుడు జాంబవంతుడి వంక దయగాచూస్తూ తన చేత్తో అతని శరీరాన్ని ఓ సారి నిమిరాడు. అంతే!

జాంబవంతుడి బాధలన్నీ మాయం అయి పూర్వపు శరీరాన్ని పొందాడు.

అప్పుడు శ్రీకృష్ణుడు తను వచ్చిన పనిని జాంబవంతుడికి వివరించాడు.

జాంబవంతా నేను శమంతక మణిని దొంగిలించానని నామీద అభియోగం వచ్చింది. నాకా మణినిచ్చి నేనా అపనిందని పోగొట్టుకునేలా చెయ్యి."

"స్వామీ! అలాగే. ఈ మణే కాక, నా కూతురు జాంబవతిని కూడా నీ భార్యగా నీకు సమర్పిస్తున్నాను. దయచేసి స్వీకరించు." కోరాడు జాంబవంతుడు.

అలా జాంబవంతుడికి అల్లుడై, కృష్ణుడు గుహలోంచి మణి, భార్యామణితో బయటికి వచ్చాడు. శ్రీకృష్ణుడికేమైందో అని బయట ఆదుర్దాగా వేచి వున్న వారంతా బాధ పడుతున్నారు. అతన్ని చూడగానే వారంతా ఆనందంతో జయజయధ్వానాలు చేసారు.

కృష్ణుడు అందరితో కలిసి తన నగరానికి వెళ్ళి, సత్రాజిత్తుని పిలిచి, శమంతకమణిని అతనికిచ్చి, ఆ మణి ఎలా మాయమైందో వివరించాడు.

"అయ్యో! లేనిపోని నింద మీ మీద మోపి తప్పు చేశాను." అని సత్రాజిత్తు బాధపడ్డాడు.

తన తప్పిదానికి పరిహారంగా సత్రాజిత్తు తన కూతురు సత్యభామని శ్రీకృష్ణునికి భార్యగా, ఆ శమంతక మణితో పాటు ఇచ్చాడు. కృష్ణుడు మణిని తిరస్కరించి, సత్యభామని మాత్రం స్వీకరించాడు.

ఓ శుభ ముహూర్తాన శ్రీకృష్ణుడు, సత్యభామలకి వివాహం జరిగింది. ఆ వివాహానికి వచ్చిన దేవతలు, మునులు శ్రీకృష్ణుడితో మొర పెట్టుకున్నారు.

"మహాత్మా! మీరు సమర్ధులు కాబట్టి చవితిన చంద్రుడిని చూడగా మీ మీద వచ్చిన అపనిందని తొలగించుకోగలిగారు. మాలాంటి అసమర్ధుల మాటేమిటి? మీరే తగిన పరిష్కారం చెప్పాలి."

కృష్ణుడు నవ్వుతూ ఇలా చెప్పాడు.

"మీరు ప్రతీ ఏడూ భాద్రపద శుద్ధ చవితి నాడు గణపతిని పూజించి, గణపతి పుట్టుక నించి, ఈ శమంతకోపాఖ్యానం దాకా మొత్తం కథ విని, లేదా చదివి అక్షింతలు తలమీద చల్లుకుంటే, ఆ రాత్రి చంద్రుని చూసినా ఎవరికీ ఎలాంటి నీలాపనిందలూ కలగవు." ఈ రోజు నుంచి వినాయకుడు విఘ్నాలకు అధిపతియేకాక, గణాలకి కూడా అధిపతి అవుతాడు కాబట్టి గజాననున్ని ఇకనుంచి విఘ్నేశ్వరుడు, గణాధిపతి అనే పేర్లతో కూడా పిలవబడుతాడు."

అది విన్న అందరూ సంతోషించారు. అప్పటినుంచి ప్రతి సంవత్సరం భాద్రపదశుద్ధ చవితినాడు దేవతలూ, మహర్షులు, మానవులు మొదలైన వారంతా తమ శక్తి కొలది వినాయకుడిని పూజించి ఈ కథ విని లేదా చదివి సుఖంగా వున్నారు.

సూత మహాముని ఆ కథని శౌనకుడు, ఇతర మునులకి చెప్పాక, వారి దగ్గర శెలవుతీసుకుని తన నివాసస్థానానికి వెళ్ళాడు.

**ఓం విఘ్నేశ్వరాయనమః**

**లోకంలోని సమస్త ప్రాణికోటికి శుభం కలుగుగాక.**

**వినాయక వ్రత కల్పం సమాప్తం**